సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 1 । మార్చి । 2024



ఓసీ విస్తరణకు అడుగులు

బొగ్గు అవసరాలు నానాటికీ పెరుగుతుండడంతో మణుగూరులో ఓసీ విస్తరణకు అడుగులు పడుతున్నాయి.

8లో



ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమారు పదేళ్ల తర్వాత రేషన్ షాపుల్లో ఒకటో తేదీ నుంచి బియ్యం సరఫరా మొదలు కానుంది.

8లో

గరిష్టం / కనిష్టం
36° / 21°

వాతావరణం

జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. శుక్రవారం ఎండ ప్రభావం అధికంగా ఉంటుంది.

ఆర్టీసీకి జాతర !

గిరిజన కుంభమేళాగా పిలిచే ములుగు జిల్లాలోని మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు నడిపించిన ఆర్టీసీకి కాసుల పంట పండింది. గత నెల 18 నుంచి 25వ తేదీ వరకు ఖమ్మం రీజియన్ నుంచి భక్తుల కోసం 310 ప్రత్యేక సర్వీసులు నడిపించారు. ఈ బస్సుల్లో 2,36,909 మంది భక్తులు వెళ్లగా, సంస్థకు రూ.3,53,83,515 ఆదాయం సమకూరింది.

– ఖమ్మంమామిళ్లగూడెం

మేడారం సర్వీసులతో రూ.3కోట్లకు పైగా ఆదాయం

- అత్యధికంగా కొత్తగూడెం డిపోకు రూ.1.23కోట్లు
- రీజియన్ నుంచి జాతరకు 310 బస్సులు
- బస్సుల్లో వెళ్లివచ్చిన 2,36,909 మంది భక్తులు



కొత్తగూడెం బస్టాండ్‌లో మేడారం బస్సు ఎక్కుతున్న భక్తులు (ఫైల్)

గతం కంటే ఎక్కువే..

గత జాతరలో 1,33,141 మంది భక్తులు ఆర్టీసీ బస్సుల్లో మేడారం వెళ్లారు. అయితే, ఈసారి మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో రద్దీ పెరుగుతుందనే అంచనాతో అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఖమ్మం రీజియన్‌తోపాటు ఇతర డిపోల నుంచి బస్సును రప్పించి భక్తులకు కోసం అందుబాటులో ఉంచారు. రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు డిపోల నుంచి 310 సర్వీసులు నడిపించగా 2,36,909 మంది భక్తులు మేడారం వెళ్లివచ్చారు. గత జాతరతో పోలిస్తే దాదాపు 80 శాతం మంది భక్తులు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవడం విశేషం.

3,080 ట్రిప్పులు

మేడారం వెళ్లే భక్తుల కోసం ఖమ్మం రీజియన్ నుంచి తొలుత అధికారులు 494 బస్సులు నడిపించాలని నిర్ణయించారు. ఆ తర్వాత పరిస్థితుల దృష్ట్యా 310 బస్సులు మాత్రమే నడిపారు. గత నెల 18 నుంచి 25 వరకు ఎనిమిది రోజుల పాటు ఈ బస్సులు 3,080 ట్రిప్‌లు నడవగా, 5,62,307 కిలోమీటర్ల మేర ప్రయాణించాయి. తద్వారా ఆర్టీసీకి రూ.3,53,83,515 ఆదాయం సమకూరగా, సగటున కి.మీ.కు రూ.62.93 ఆదాయం నమోదైందని అధికారులు వెల్లడించారు.

కొత్తగూడెం డిపో నుంచే ఎక్కువ

ఖమ్మం రీజియన్ పరిధిలో కొత్తగూడెం డిపో నుంచే మేడారం జాతరకు ఎక్కువ బస్సులు నడిచాయి. ఈ డిపో నుంచి 119 బస్సులు 641 ట్రిప్‌లుగా నడిపించాయి. మొత్తంగా 2,08,690 కిలోమీటర్లు తిరగడం ద్వారా ఈ డిపోకు రూ.1,23,87,179 ఆదాయం వచ్చింది. 94 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో ఇక్కడి నుంచి బస్సులు నడవగా 67,040 మంది భక్తులు మేడారం వెళ్లారు. ఇక మధిర డిపో నుంచి తక్కువగా 20 బస్సులే నడవడంతో ఈ డిపో ద్వారా రూ.25,56,625 ఆదాయం వచ్చింది. ఇక్కడి నుంచి బస్సులు 82 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడిచాయి. కాగా, ఆర్టీసీ సేవలను వినియోగించుకున్న భక్తులకు ఖమ్మం రీజియన్ మేనేజర్ సీహెచ్.వెంకన్న ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

డిపోల వారీగా మేడారం జాతర ఆదాయం

డిపో	బస్సుల సంఖ్య	ఆదాయం
ఖమ్మం	85	రూ.59,97,780
మధిర	20	రూ.25,56,625
సత్తుపల్లి	33	రూ.34,96,899
భద్రాచలం	30	రూ.57,32,932
కొత్తగూడెం	119	రూ.1,23,87,179
మణుగూరు	23	రూ.52,12,100
మొత్తం	310	రూ.3,53,83,515

మహాలక్ష్మితో పెరిగిన రద్దీ..

ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో వారే కాక కుటుంబమంతా ఆర్టీసీ బస్సులనే ఎంచుకున్నారు. దీంతో రీజియన్ నుంచి 2,36,909 మంది భక్తులు బస్సుల్లో మేడారం సమ్మక్క–సారలమ్మ దర్శనానికి వెళ్లారు. ఇందులో 90,628 మంది పురుషులు ఉండగా.. మహిళలు 1,46,281 మంది ఉండడం విశేషం. జాతర సర్వీసుల్లో సగటున 98శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదైంది.

ఆనందమానందమాయె

- ఏళ్ల తర్వాత డీఎస్సీకి మోక్షం
- 'మెగా' ప్రకటనతో నిరుద్యోగుల్లో హర్షం
- ఉమ్మడి జిల్లాలో 1,022 పోస్టులు
- గత నోటిఫికేషన్‌తో పోలిస్తే పెరిగిన వైనం



ఖమ్మం కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

కొత్తగూడెం అర్బన్/ఖమ్మం సహకారనగర్: సుదీర్ఘ కాలంగా ఉపాధ్యాయ పోస్టుల పరీక్ష కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. డీఈడీ, బీఈడీ పూర్తిచేయడమే కాక టెట్ అర్హత సాధించిన పలువురు ఎదురుచూస్తుండగా.. ప్రభుత్వం గురువారం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో 1,022 పోస్టులు భర్తీ చేయనున్నట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించగా.. అభ్యర్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో ఖమ్మం జిల్లాలో 575 పోస్టులు ఉండగా, భద్రాద్రి జిల్లాలో 447 పోస్టులు ఉన్నాయి.

కొత్తప్రభుత్వంలో సరికొత్తగా..

అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగా.. గత ఏడాది నోటిఫికేషన్‌తో పోలిస్తే ఎక్కువ సంఖ్యలో పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించారు. దీంతో ఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. జిల్లాల వారీగా ఖాళీలు కూడా వెల్లడించడంతో అభ్యర్థులు చదువుపై దృష్టి సారించనున్నారు. కాగా, భద్రాద్రి జిల్లాలో గత ఏడాది 185 పోస్టులతో నోటిఫికేషన్ రాగా, ఈసారి 262 పోస్టులు పెంచి 447 పోస్టులు భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. కానీ జిల్లాలో 700కు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అంచనా.

35వేల మందికి పైగానే...

బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు ఉమ్మడి జిల్లాలో 35వేల మందికి పైగానే ఉంటారని అంచనా. ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించడంతో అభ్యర్థులు పుస్తకాలతో కుస్తీ మొదలుపెట్టనున్నారు. ఇప్పటికే అభ్యర్థులు పలువురు పరీక్షలకు సిద్ధమవుతుండగా.. మరికొందరు నోటిఫికేషన్‌పై స్పష్టత లేకపోవడంతో ఇతర ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి పోస్టులపై స్పష్టత ఇవ్వడంతో మళ్లీ సన్నద్ధతపై దృష్టి సారించనున్నారు.

ఆన్‌లైన్‌లో పరీక్ష

రాష్ట్ర ప్రభుత్వం ఈసారి డీఎస్సీ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దీనిని నిరుద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వాగతిస్తున్నారు. ఆన్‌లైన్ విధానం కావడంతో ఎలాంటి అవకతవకలు జరిగే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, ఈనెల 4వ తేదీ నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పరీక్ష, నియామకాలు పూర్తిచేసి ఉపాధ్యాయులను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

2017 తర్వాత ఇప్పుడే..

2017లో టీఆర్‌టీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసింది. అనంతరం ఏళ్ల తరబడి నిరీక్షించగా గత ప్రభుత్వం 2023లో మరోమారు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులు కూడా స్వీకరించింది. అదే సమయాన టెట్ కూడా నిర్వహించింది. అయితే, రాతపరీక్ష కంటే ముందే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పరీక్ష వాయిదా పడింది.

జిల్లాల వారీగా పోస్టుల వివరాలు

	ఖమ్మం	భద్రాద్రి కొత్తగూడెం
స్కూల్ అసిస్టెంట్లు	176	129
లాంగ్వేజ్ పండిట్	18	10
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్	10	01
ఎస్‌జీటీ	334	268
ఎస్ఏ (స్పెషల్ ఎడ్యుకేటర్స్)	08	08
ఎస్‌జీటీ (స్పెషల్ ఎడ్యుకేటర్స్)	29	31
మొత్తం	575	447

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్య కల్యాణ వేడుక గురువారం నేత్ర పర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ బేడా మండపంలో కొలువుదీర్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో వైభవంగా అర్చన నిర్వహించారు. ఆ తర్వాత మంత్రపుష్పం, నివేదన, హారతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.రజనీకుమారి, వేద పండితులు పద్మనాభశర్మ, అర్చకులు రవికుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు గంధం వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి బెటాలియన్ సమస్యలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): లక్ష్మీదేవిపల్లి మండలంలోని 6వ బెటాలియన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలను బెటాలియన్ అధికారులు కోరారు. ఈ మేరకు అదనపు కమాండెంట్ ఎ.అంజయ్య, ఆర్ఐలు జి.వి. రామారావు, జి. శ్యాంప్రసాద్, ఆర్ఎస్ఐ జి. గోపి గురువారం కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరించారు. బెటాలియన్‌కు రోడ్డు, పెట్రోల్‌బంకు స్థలం, యూనిట్ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించడానికి ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, తమ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని అధికారులు తెలిపారు.

అయన్నపాలెం వాసికి డాక్టరేట్



శ్రీనివాస్

చంద్రుగొండ: చంద్రుగొండ మండలం అయన్నపాలెం గ్రామానికి చెందిన బూరుగు శ్రీనివాస్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ లభించింది. 'ఎఫెక్ట్ ఆఫ్ బిస్మత్ ఆక్సైడ్, అల్యూమినియం ఆక్సైడ్ ఆన్ ఫిజికల్, ఆప్టికల్, స్ట్రక్చరల్ అండ్ ఫిల్లింగ్ ప్రాపర్టీస్ ఆఫ్ జింక్ కాడ్మియం బోరెట్ గ్లాసెస్' అంశంపై ఆయన పరిశోధనాత్మక పత్రం సమర్పించారు. అయన్నపాలెంకు చెందిన వ్యవసాయ కూలీ బూరుగు ముత్తయ్య, సావిత్రి దంపతుల కుమారుడైన శ్రీనివాస్ ప్రస్తుతం హన్మకొండలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు.

'ద్వితీయ' పరీక్షలు ప్రారంభం



కొత్తగూడెంలోని ఓ పరీక్ష కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు జిల్లాలో గురువారం ప్రారంభమయ్యాయి. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ద్వితీయ సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 9,416 మంది విద్యార్థులకు గాను 9106 మంది పరీక్షకు హాజరయ్యారు. 310 మంది గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. ఇంటర్ పరీక్షల మొదటి రోజైన బుధవారం వివిధ కేంద్రాలను కలెక్టర్, ఎస్పీ, నోడల్ అధికారి తనిఖీ చేసిన నేపథ్యంలో రెండో రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు, పరీక్ష నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలి

ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ శర్మ

బూర్గంపాడు: ఐటీసీ, రోటరీ క్లబ్‌లు అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్‌శర్మ అన్నారు. సారపాక రాజీవ్‌నగర్‌లోని శ్రీ సత్యసాయి స్కూల్‌కు ఐటీసీ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో రూ.లక్ష విలువ చేసే యూనిఫామ్, ప్లేట్లు, గ్లాసులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీసీ పీఎస్‌పీడీ పరిసర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేయూత అందిస్తామని చెప్పారు. అన్ని పాఠశాలల్లో ఉచిత నోట్ పుస్తకాలు అందించడంతో పాటు అదనపు తరగతి గదులు, ప్రహరీలు, డైనింగ్ హాళ్లు, వంట షెడ్లు, టాయిలెట్ల నిర్మాణాలకు సహకరిస్తామని తెలిపారు. ప్రథమ్ సంస్థ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో ట్యూటర్లను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఐటీసీ పీఎస్‌పీడీ హెచ్‌ఆర్ హెడ్ శ్యామ్‌కిరణ్, చెంగలరావు, రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడు జయంత్‌కుమార్ దాస్, కార్యదర్శి కేవీవీ గోవిందరావు, శివరాంకృష్ణన్, ప్రఫుల్ల, నాగమల్లేశ్వరరావు, ప్రతాప్, సాయిరాం, మరడాన శ్రీనివాస్ పాల్గొన్నారు.

అయోధ్యకు ప్రత్యేక రైలు..

కొత్తగూడెం నుంచి 280 మంది పయనం

కొత్తగూడెంఅర్బన్ : భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) రైల్వే స్టేషన్ నుంచి అయోధ్యకు ప్రత్యేక రైలు గురువారం బయలుదేరింది. ఐఆర్‌సీటీసీ ఏర్పాటు చేసిన ఈ రైలు మధ్యాహ్నం 12 గంటలకు కొత్తగూడెం చేరుకుని, తిరిగి 3 గంటలకు ఇక్కడి నుంచి కదిలింది. అయోధ్య వెళ్లేందుకు 283 మంది టికెట్లు బుక్ చేసుకోగా, 280 మంది భక్తులు మాత్రమే వెళ్లారు. వివిధ కారణాలతో ముగ్గురు వెళ్లలేకపోయారు. గత నెల 16న భద్రాచలం రోడ్ స్టేషన్ నుంచి మొదటిసారి వెళ్లిన రైలులో 400 మందికి పైగా భక్తులు వెళ్లగా, రెండో రైలులో 280 మంది తరలివెళ్లారు. రైలు బయలుదేరే వరకు రైల్వే, త్రీటౌన్ పోలీసులు పూర్తి భద్రత కల్పించారు. కాగా, రైల్వే స్టేషన్ ప్రాంగణమంతా రామనామంతో మార్మోగింది.

56 రోజులు.. రూ.1.77 కోట్లు

భారీగా పెరిగిన భద్రాద్రి రామయ్య ఆదాయం



కానుకలు లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, సిబ్బంది

భద్రాచలంటౌన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆలయ హుండీలను అధికారుల గురువారం లెక్కించారు. 56 రోజులకు గాను భక్తులు సమర్పించిన కానుకలు రూ.1,77,92,825 సమకూరాయని ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. ఈ నగదుతో పాటు 174 గ్రాముల బంగారం, కేజీ 248 గ్రాముల వెండి, పలు విదేశీ కరెన్సీ లభించాయని పేర్కొన్నారు. ఇటీవల సంక్రాంతి సెలవుల సందర్భంగా భక్తులు భారీగా తరలిరావడంతో ఆదాయం పెరిగిందని అధికారుల అంచనా. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులతో పాటు స్వచ్ఛంద సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల డిగ్రీ అధ్యాపకులుగా ఎంపిక



బానోతు ప్రవళిక



గుగులోత్ తేజస్విని

టేకులపల్లి: గురుకుల డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీకి గతేడాది నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఇందులో టేకులపల్లి మండలానికి చెందిన ఇద్దరు గిరిజన యువతులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలంలోని కొండెంగులబోడుకు చెందిన డాక్టర్ బానోత్ ప్రవళిక డిగ్రీ కళాశాల లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. ఆమె 2018లో కేయూ నుంచి ఎమ్మెస్సీలో గోల్డ్ మెడల్ సాధించగా, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసింది. ఇక బొమ్మనపల్లి గ్రామానికి చెందిన గుగులోత్ తేజస్విని సైతం లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికైంది. జాతీయ స్థాయిలో జరిగే సెట్, నెట్, సీఎస్ఐఆర్, జేఆర్ఎఫ్, గేట్ పరీక్షల్లోనూ అర్హత సాధించిన తేజస్విని.. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తోంది.

అసెంబ్లీ ఫలితాలు తిరగరాయాలి

- రెండు లోక్‌సభ స్థానాల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి
- రాహుల్‌ను ప్రధానిగా చేయడమే మన కర్తవ్యం
- ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు పెద్దపీట
- దమ్మపేట, ఇల్లెందు సభల్లో మంత్రి పొంగులేటి



దమ్మపేట సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఇల్లెందులో పొంగులేటిని సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

అశ్వారావుపేట/ఇల్లెందు : వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎవరికి బీ ఫాం ఇచ్చినా భారీ మెజార్టీతో వారి గెలుపుకోసం ప్రతీ నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని, పార్లమెంట్ ఎన్నికల్లో అసెంబ్లీ నాటి ఫలితాలను తిరగరాయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. దమ్మపేట, ఇల్లెందుల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. 60 ఏళ్ల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర సాధన ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని, రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రి పీఠంపై కూర్చోబెట్టాలని అన్నారు. మాట తప్పని, మడమ తిప్పని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటవెంటనే నెరవేరుస్తోందన్నారు. అతి త్వరలోనే ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని, ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. ఇతర జిల్లాల్లో మూడు వేల చొప్పున ఇస్తే, ఇక్కడ ఐదు వేల ఇళ్లు ఇస్తామని చెప్పారు. మహిళలకు రూ.2,500 నగదు పథకం కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. లోక్‌సభ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి స్థానిక ఎన్నికల్లో అవకాశాలు దక్కుతాయని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి తెలుగు తమ్ముళ్లు సైతం సహకరించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో బడా బాబులు విచ్చలవిడిగా ప్రజాధనాన్ని దోచుకున్నారని, వారి ఆగడాలు ఇక చెల్లవని అన్నారు. కుంటి సాకులతో కొందరు నాయకులు కాంగ్రెస్‌ను వీడారే తప్ప ప్రజలు పార్టీని వీడలేదన్నారు. గత పాలకుల అవినీతిని వెలికి తీసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రోజుకు 14 గంటలు పనిచేస్తున్నామని, వారు మెక్కిన ప్రతీ రూపాయిని కక్కించి ప్రజలకు పంచుతామని ప్రకటించారు. రాష్ట్ర అప్పు రూ.7లక్షల కోట్లుగా తేలినా సంక్షేమ పథకాలు ఆగవన్నారు. కాళేశ్వరం పేరుతో గొప్పలు చెప్పిన కేసీఆర్ ఇప్పుడు అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేశారని విమర్శించారు.

ఉద్యోగాలు భర్తీ చేస్తాం..

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే 25 వేల ఉద్యోగాలు ఇచ్చామని పొంగులేటి తెలిపారు. ఇప్పుడు మెగా డీఎస్సీ ప్రకటించామని, మిగిలిన శాఖల్లోని ఖాళీలనూ భర్తీ చేస్తామని చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పోడు భూములకు పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని గతంలో ప్రవేశపెట్టారని, తాను రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్నందున మిగిలిన భూములకు సైతం పట్టాలు ఇచ్చి తీరుతామని ప్రకటించారు. ఆరు గ్యారంటీల్లోనూ నాలుగు ఇప్పటికే అమలు చేశామని, మిగితా రెండు కూడా త్వరలోనే చేస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ పథకాల్లో ఏ లోపంతోనైనా జాబితాలో పేర్లు లేనివారు అధైర్య పడొద్దని, ఎంపీడీఓ, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 17 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని చెప్పారు. కాగా, ఇల్లెందులో ఐఎన్‌టీయూసీ నేతలు పొంగులేటిని ఘనంగా సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఆయిల్‌పాం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, దమ్మపేట ఎంపీపీ సోయం ప్రసాద్, నాయకులు తేజావత్ బెల్లయ్య నాయక్, డాక్టర్ శంకర్‌నాయక్, బత్తుల అంజి, డానియేల్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, ఐఎన్‌టీయూసీ నేతలు జె.వెంకటేశ్వర్లు, క్లాం కోటిరెడ్డి పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాకు వచ్చిన రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ చైర్మన్



చైర్మన్‌కు పార్టీ కండువా కప్పుతున్న పొంగులేటి

కొత్తగూడెంరూరల్: జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమక్షంలో గురువారం కాంగ్రెస్‌లో చేరారు. 2019లో చుంచుపల్లి జెడ్పీటీసీగా బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన కంచర్ల.. జెడ్పీ వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆ తర్వాత చైర్మన్ కనకయ్య ఇల్లెందు ఎమ్మెల్యేగా గెలవడంతో చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, పీసీసీ సభ్యులు నాగా సీతారాములు, నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, ఆళ్ల మురళి, తూము చౌదరి, నాగేంద్ర త్రివేది, రజాక్, శంకర్‌నాయక్, యర్రంశెట్టి ముత్తయ్య, చీకటి కార్తీక్, పాల సత్యనారాయణరెడ్డి, బాల ప్రసాద్, సుందర్‌లాల్ కోరి, దుంపల రాజేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా శివాలయ వార్షికోత్సవం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, శాంతి కల్యాణాన్ని అర్చకులు కనులపండువగా జరిపించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. సత్తుపల్లి పట్టణానికి చెందిన కంభంపాటి శ్రీనివాసరావు దంపతులు అమ్మవారికి రూ.1,11,500 విలువగల మంగళసూత్రాన్ని బహూకరించారు.

ముగిసిన బాలోత్సవ్



మాట్లాడుతున్న సినీనటి గీతాసింగ్

కొత్తగూడెంరూరల్: సింగరేణి సీఈఆర్ క్లబ్ మూడు రోజులపాటు జరిగిన బాలోత్సవం బుధవారం అర్ధరాత్రి ముగిసింది. ముఖ్యఅతిగా హాజరైన సినీనటి గీతా సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవడంతోపాటు సృజనాత్మకశక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవ్ కన్వీనర్ మద్దెల శివకుమార్, చుంచుపల్లి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంతోటి పాల్, కొదురుపాక రాజేంద్రప్రసాద్, సురేందర్, బాలాజీ, తాండూరు దనరాజు, గుమలాపురం సత్యనారాయణ, సుధాకర్, బాలు, మునీల, మల్లెల ఉషారాణి, లాజరస్, శివ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి రూ.2.10 లక్షల విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తులు విరాళం అందజేశారు. హైదరాబాద్ శాలిబండకు చెందిన నాగులపల్లి కోదండ రామారావు–రజిత, కోదండ రామారావు–లక్ష్మీప్రసూన దంపతులు రూ.2.10లక్షల చెక్కును గురువారం అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా వారికి ఆలయ ఉద్యోగి సాయిబాబా, అర్చకులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేయగా, దాతలు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పాఠశాలలకు 'ఎల్‌అండ్‌టీ' వితరణ



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

అశ్వాపురం: సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం, అమెర్ద, అమెర్ద కాలనీ పాఠశాలలకు గురువారం భారీగా సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి ఎల్‌అండ్‌టీ సంస్థ చేయూత అభినందనీయమని పేర్కొన్నారు. పాఠశాలలకు విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, బూట్లు, బడిగంట, వంట స్టవ్, బ్లాక్ బోర్డులు, ఆట వస్తువులు, బల్లలు, కుర్చీలు, ప్లేట్లు, వాలీబాల్, టెన్నిస్ కిట్స్, ఫ్రిజ్ వంటి సామగ్రి అందించారని తెలిపారు. ఎంఈఓ వీరస్వామి, ఎల్‌అండ్‌టీ సంస్థ మేనేజర్ రజనీష్ చౌహాన్, అధికారులు రమేష్, అభయ్, దక్షిణామూర్తి, కౌశిక్, హనుమంతరావు, పాఠశాలల హెచ్ఎంలు వెంకట్, శంకర్, శ్రీనివాస్, రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేఎల్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు పురస్కారం



అవార్డు అందుకుంటున్న సురేంద్ర కుమార్

పాల్వంచ: కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సురేంద్ర కుమార్ 'ఎక్స్‌లెన్స్ ఇన్ ఎడ్యుకేషన్' పురస్కారం అందుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో పేరెటోస్ హోటల్‌లో ఔట్‌లుక్ మ్యాగజైన్, ఎడ్ టెక్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మింగ్ ఎడ్యుకేషన్ విత్ టెక్నాలజీపై నిర్వహించిన సదస్సులో అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను కేఎల్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ కె.నాగమణి, డైరెక్టర్లు, అధ్యాపకులు అభినందించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

- 1వ తేదీ నుంచే రేషన్ బియ్యం పంపిణీ
- పదేళ్ల తర్వాత సకాలంలో ప్రారంభం
- ఇప్పటికే షాప్‌లకు చేరిన బియ్యం

ఖమ్మం సహకారనగర్: సుమారు పదేళ్ల తర్వాత రేషన్ షాపుల్లో ఒకటో తేదీ నుంచి బియ్యం సరఫరా మొదలుకానుంది. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యాన అందించే బియ్యం పంపిణీని 1వ తేదీనే మొదలుపెట్టాలని ఆదేశాలు అందాయి. దీంతో శుక్రవారం నుంచి జిల్లాలో బియ్యం సరఫరాకు డీలర్లు సిద్ధమయ్యారు.

19 లక్షల మందికి పైగా లబ్ధిదారులు

ఖమ్మం జిల్లాలోని 21 మండలాల పరిధిలో 748 రేషన్ దుకాణాలు.. 4,11,315 కార్డులు ఉన్నాయి. ఇందులో ఆహార భద్రతా కార్డులు 3,84,483, అంత్యోదయ కార్డులు 26,829, అన్నపూర్ణ కార్డులు 3 ఉండగా, అన్నింట్లో కలిపి 11,31,487 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ నెలనెలా 72,81,357 కిలోల బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 27 మండలాల్లో 551 రేషన్‌షాపులు ఉండగా 2,93,300 కార్డులు ఉన్నాయి. వీటిలో ఆహార భద్రతా కార్డులు 2,74,496, అంత్యోదయ కార్డులు 18,801, అన్నపూర్ణ కార్డులు 3 ఉండగా, లబ్ధిదారులు 8,39,744మంది ఉన్నారు. వీరికి 10,52,522 కిలోల బియ్యం అవసరమవుతాయనే అంచనా రేషన్ షాపుల్లో సిద్ధం చేశారు.

గతంలో గందరగోళం.

గత ప్రభుత్వ హయంలో సుమారు పదేళ్ల పాటు రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా కొనసాగింది. ఏ నెలలో ఎప్పుడు బియ్యం పంపిణీ మొదలవుతుందో తెలియని పరిస్థితి ఉండేది. ఉన్నతస్థాయి ఆదేశాల కోసం నెలనెలా ఎదురుచూడడం.. ఆదేశాలు అందక బియ్యం పంపిణీ మొదలుపెట్టినా ఎన్ని రోజులు ఇస్తారో తెలియకపోయేది. దీంతో లబ్ధిదారులు నెల మొదటి నుంచి రేషన్ దుకాణాల చుట్టూ తిరగడం కనిపించేది. పలుమార్లు లబ్ధిదారుల అవస్థ చూడలేక డీలర్లే పైనుంచి ఆదేశాలు రాగానే బియ్యం పంపణీ తేదీ తెలియచేస్తామని నచ్చచెప్పి పంపించేవారు.



ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం లోడ్ చేస్తున్న హమాలీలు

సంస్కరణలు..

ఇటీవల ఏర్పడిన ప్రభుత్వం ఒక్కో శాఖపై దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో సీఎంఆర్‌పై దృష్టి సారించి మిల్లర్ల నుంచి బియ్యం సేకరణలో వేగం పెంచారు. ఇక ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రేషన్ షాపుల ద్వారా ప్రతినెల 1నుంచి 15వ తేదీ వరకు మాత్రమే లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించింది. ఇక ఏ నెల కూడా ఎట్టి పరిస్థితుల్లో ఈ తేదీల్లో మార్పులు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో శుక్రవారం నుంచి రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసేందుకు డీలర్లు సిద్ధమయ్యారు.

దుకాణాలకు చేరిన బియ్యం

జిల్లాలోని రేషన్ దుకాణాలకు ఎంఎల్ఎస్ (మండల లెవల్ స్టాక్) పాయింట్ల బియ్యాన్ని సరఫరా చేశారు. ఫిబ్రవరి 23వ తేదీ నుంచే దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తుండగా దాదాపు 80శాతం బియ్యం డీలర్లకు చేరింది. గత నెలలో మిగిలిన బియ్యం కలుపుకుంటే ఈ నెలలో లబ్ధిదారులకు సరఫరా చేసేందుకు సరిపోతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా,సుమారు పదేళ్ల తర్వాత 1వ తేదీన బియ్యం పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుండడంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



	షాపులు	మొత్తం కార్డులు	లబ్ధిదారులు
ఖమ్మం	748	4,11,315	11,31,487
భద్రాద్రి కొత్తగూడెం	551	2,93,300	8,39,744
మొత్తం	1,299	7,04,615	19,71,231

నేటి నుంచి పంపిణీ



జిల్లాలోని లబ్ధిదారులకు 1వ తేదీనే రేషన్ బియ్యం పంపిణీని ప్రారంభించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఇప్పటికే రేషన్‌షాపులకు దాదాపు బియ్యం చేరవేశాం. శుక్రవారం నుంచి బియ్యం పంపిణీ ప్రారంభించాని డీలర్లకు సూచించాం.

– చందన్‌కుమార్, డీఎస్ఓ, ఖమ్మం

షాపులకు 80 శాతం మేర బియ్యం



ప్రభుత్వం 1వ తేదీ నుంచే బియ్యం పంపిణీ చేయాలని సూచించిన నేపథ్యాన ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి దుకాణాలకు బియ్యం సరఫరా చేశాం. ఇప్పటి వరకు 80శాతం బియ్యం దుకాణాలకు చేరింది. ఎక్కడైనా మిగిలినా శుక్రవారంతో సరఫరా పూర్తవుతుంది.

– జి.శ్రీలత, డీఎం, పౌరసరఫరాల సంస్థ, ఖమ్మం

'ఫిబ్రవరి 29' చిన్నారులు!

ఎంసీహెచ్‌లో 9 మంది జననం



ఎంసీహెచ్‌లో జన్మించిన చిన్నారి

కొత్తగూడెంరూరల్: నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ సంవత్సరంలో ఫిబ్రవరి నెలలో 29 రోజులు ఉండే విషయం తెలిసిందే. ఫిబ్రవరి 29న పుట్టిన వారు నాలుగేళ్లకోసారి పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. గురువారం ఫిబ్రవరి 29 కాగా, జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 9 మంది చిన్నారులు జన్మించారు. చంద్రుగొండ మండలానికి లక్ష్మీదేవి, ములకలపల్లికి చెందిన భార్గవి, కృష్ణా జిల్లాకు చెందిన కొత్తపల్లి గ్రామానికి చెందిన కోర్సం శివమణి, పినపాక గ్రామానికి చెందిన ప్రసన్న, అశ్వాపురం మండలం మల్లెల మడుగు గ్రామానికి చెందిన చిలకమర్రి తేజాప్రసన్న, దమ్మపేట మండలం ముష్టిబండ గ్రామానికి చెందిన కోలికపోగు జ్యోతి, ఇల్లెందు మండలానికి చెందిన అల్లూరి తిరుపతమ్మ, మహబూబాబాద్‌కు చెందిన చింత స్రవంతి, దుమ్ముగూడెం మండలం పైడిగూడెం గ్రామానికి చెందిన కణితి శాంతి బిడ్డలకు జన్మనిచ్చారు. వైద్యసేవలందించివారిలో ఆర్ఎంఓ వీరబాబు వైద్యులు సింధు, సింధుజా, లతీఫ్, ఉమామహేశ్వరి మేరీ, స్వప్న తదితరులు ఉన్నారు.



ప్రభుత్వాస్పత్రిలో జన్మించిన బాలుడితో తల్లి

పాల్వంచలో...

పాల్వంచ: పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఓ బాలుడు జన్మించాడు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం తనిపర్తి గ్రామానికి చెందిన అంకని సాయికుమార్ భార్య పద్మ ఆస్పత్రిలో కాన్పు పొందింది. నాలుగేళ్లకోసారి వచ్చే ఫిబ్రవరి 29న కుమారుడు జన్మించడంతో తల్లిదండ్రులు, కుటంబ సభ్యులు మురిసిపోతున్నారు.

మణుగూరు ఓసీ విస్తరణకు అడుగులు

- భూసేకరణపై సమీక్షించిన ఎస్‌డీసీ సుమ
- ఈనెల 4, 6వ తేదీల్లో గ్రామసభలు

మణుగూరు టౌన్: మణుగూరు ఓపెన్‌కాస్ట్ విస్తరణకు అడుగులు పడుతున్నాయి. బొగ్గు అవసరాలు నానాటికీ పెరుగుతున్న నేపథ్యాన మణుగూరు ఓసీ విస్తరణ అనివార్యం కాగా, 813 ఎకరాల భూమి కేటాయించాలని సింగరేణి అధికారులు దరఖాస్తు చేశారు. ఈ నేపథ్యాన ప్రత్యేక అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) టి.సుమను కలెక్టర్ నియమించారు. దీంతో ఎస్‌డీసీ సుమ గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఆమె మణుగూరు ఓసీలో క్షేత్రస్థాయిలో పరిశీలించి సింగరేణిలో అధికారులతో సమావేశమయ్యారు. మణుగూరు మండలంలోని తిర్లాపురం, రామానుజవరం పంచాయతీతో పాటు మణుగూరులో సింగరేణికి అవసరమైన 813 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, పట్టా భూములను సేకరించడంపై సమీక్షించారు. ఓసీకి సమీపంలో ఉన్న పొలాల యజమానులు, ఇతర వివరాలపై ఆరా తీశారు. అనంతరం సుమ మాట్లాడుతూ ఈనెల 4న రామానుజవరంలో, 6వ తేదీన తిర్లాపురంలో పీసా గ్రామసభలు నిర్వహించి భూసేకరణపై ప్రజాభిప్రాయం సేకరించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి, ఆర్ఐ లీలావతి, సింగరేణి అధికారులు వీసం కృష్ణయ్య, రాజు, శ్రీనివాసాచారి తదితరులు ఉన్నారు.



మణుగూరు ఓసీ పరిసరాల్లో పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్, అధికారులు

రూ. లక్షలు చేతులు మారాయి!

వసతి గృహ నిర్మాణ విషయంలో ముడుపులు పుచ్చుకున్న ఓ అధికారి

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో భక్తుల వసతిగృహ నిర్మాణ వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారిన సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. నిర్మాణ బాధ్యతలు ఇవ్వకపోవడంతో ఓ ట్రస్ట్ సభ్యుల నుంచి తీసుకున్న మొత్తంలో ఓ అధికారి తిరిగి కొంత చెల్లించినట్లు తెలిసింది. భద్రాచలంలో వసతి గృహ నిర్మాణం చేపట్టేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ ట్రస్టు ముందుకు వచ్చింది. అదే ట్రస్టుకు హైదరాబాద్‌కే చెందిన కొందరు మూడేళ్ల క్రితం రూ. 11లక్షలు అందించారు. ఆ సమయంలో శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో కీలకంగా ఉన్న ఓ అధికారి వసతి గృహ నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తామని, సదరు ట్రస్టు నిర్వాహకుల నుంచి రూ.18 లక్షలు తీసుకున్నట్లు సమాచారం. కాగా 30 గదుల వసతి గృహ నిర్మాణాన్ని దేవస్థానం ఆధ్వర్యంలోనే రూ.3.5 కోట్లతో నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు అప్పగించకపోవడంతోపాటు నగదుకు దేవస్థానం నుంచి రశీదులు కూడా రాకపోవడంతో సదరు ట్రస్ట్ బాధ్యులు సదరు కీలక అధికారిపై ఒత్తిడి పెంచారు. ప్రస్తుత ఈఓ రమాదేవిని కలిసి సమస్య వివరించారు. ట్రస్ట్ నిర్వాహకులు ఒత్తిడి పెంచడంతో బుధవారం ఇరువర్గాలు చర్చించుకున్నట్లు తెలిసింది. సదరు అధికారి రూ.11లక్షలు తిరిగి ఇచ్చివేసినట్లు తెలిసింది. మిగిలిన రూ.7లక్షలు త్వరలో ఇస్తానని ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఈఓ రమాదేవిని వివరణ కోరగా.. ట్రస్టు నిర్వాహకులు గతంలో నోటి మాటగా విషయం చెప్పారని, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెన్నంగులగడ్డలో చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ చెన్నంగులగడ్డ గ్రామంలో చోరీ జరిగింది. వారం రోజుల క్రితం మేడారం వెళ్లిన గ్రామానికి చెందిన నిర్మల గురువారం ఇంటికి వచ్చే సరికి ఈ ఘటన చోటుచేసుకుంది. దుండగులు ఇంటి వెనుకభాగం నుంచి తలుపులు పగులగొట్టి రూ.15 వేల నగదు, 25 తులాల వెండి, అరతులం బంగారం అపహరించారు. బాధితురాలు ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

3న బెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్

భద్రాచలంటౌన్: పట్టణంలోని సిటీస్టైల్ జిమ్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న ఆరు జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల చాంపియన్ షిప్–2024 నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భోగాల శ్రీనివాసరెడ్డి గురువారం ఒకు ప్రకటనలో తెలిపారు. స్థానిక గిరిజన అభ్యుదయ భవన్‌లో నిర్వహించే ఈ పోటీలకు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి క్రీడాకారులు పేరు నమోదు చేయించుకోవాలని కోరారు.

ప్లాట్లలో బాధితుల పాగా

సుజాతనగర్: నూతన పోలీస్‌స్టేషన్‌లో సమీపంలోని తమ ప్లాట్లలో బాధితులు గురువారం పాగా వేశారు. ఇక్కడి వెంచర్‌లో 2013 సంవత్సరంలో జిల్లాలోని ఆయా ప్రాంతాలకు చెందిన సుమారు 120 మంది ప్లాట్లను కొనుగోలు చేశారు. సర్వే నంబర్ 1536లో వీరంతా ప్లాట్లను కొనుగోలు చేయగా, ఒక్కో ప్లాటుకు రూ.2 లక్షల రూపాయల పైచిలుకు మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో చెల్లించి ప్లాట్లను సొంతం చేసుకున్నారు. అయితే ప్లాట్లు విక్రయించిన వ్యక్తి వీరి పేర 1536వ సర్వే నంబరుతో రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా, ఇతర నంబర్లతో తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించాడు. తాము కొనుగోలు చేసిన స్థలాలు ఇతర నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించిన విషయం తెలుసుకున్న బాధితులు నాటి నుంచి ప్లాట్ల కోసం తిరుగుతున్నారు. కాగా వీరు కొనుగోలు చేసిన సదరు స్థలం, పాల్వంచకు చెందిన మరో వ్యక్తి పేరున తాకట్టులో ఉండటంతో సదరు యజమాని సైతం వీరిని ప్లాట్లలోకి రానీయకుండా అడ్డుకుంటున్నాడు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్, కోర్టును కూడా ఆశ్రయించారు. బాధితులకు ప్లాట్లు అప్పగించే విషయంలో పలుమార్లు చర్చలు జరిగినా సమస్య కొలిక్కిరాలేదు. దీంతో ఇన్నాళ్లు నిరీక్షించిన బాధితులు ప్లాట్ల వద్దకు చేరుకుని హద్దురాళ్లపై గతంలో ఉన్న రంగు స్థానంలో మరో రంగు వేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ములకలపల్లి : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచకు చెందిన చర్ల వేణుగోపాల్ (35) తన మిత్రుడు ముత్యాల సుమన్‌తో కలిసి బైక్‌పై ములకలపల్లికి వచ్చాడు. తిరిగి పాల్వంచకు వెళుతుండగా ములకలపల్లివైపు వస్తున్న ఆటో మాధారం అటవీప్రాంతంలో ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న సుమన్‌కు తీవ్రగాయాలయ్యాయి. వేణుగోపాల్ బైక్‌పై నుంచి ఎగిరిపడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌తోపాటు ఇద్దరు ప్రయాణికులు సైతం గాయపడ్డారు. మృతుని తండ్రి చర్ల వెంకటప్పయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజమౌళి తెలిపారు.

పోలీసుల అదుపులో పేకాట రాయుళ్లు

పాల్వంచ : పట్టణంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. గట్టాయిగూడెంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.25 వేలు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లలో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు. అయితే ఇంకా కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట: మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.6,260 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగుల పేరిట బ్యాంకుకు కుచ్చుటోపీ

- తప్పుడు పత్రాలతో రూ.60లక్షల మేర రుణాలు
- ముఠాలో సభ్యుల నడుమ విభేదాలతో బయటకు...

ఖమ్మంక్రైం: ప్రభుత్వ ఉద్యోగుల పేరిట నకిలీ పత్రాలతో ఎస్‌బీఐలోని వివిధ బ్రాంచ్‌ల్లో రూ.60లక్షల రుణాలు ఇప్పించిన ముగ్గురిని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు గురువారం రాత్రి అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరికొందరిపై కూడా కేసు నమోదు చేశారు. సీఐ ఉదయ్‌కుమార్ కథనం ప్రకారం... గుగ్గిళ్ల విజయ్‌కుమార్, నల్లగట్ల కరుణాకర్, నజీర్, ప్రశాంత్ ముఠాగా ఏర్పడి కోటమర్తి దినేష్‌కుమార్‌తోపాటు మరో ఎనిమిది మందిని కూడగట్టారు. ఆయా వ్యక్తులు కేంద్ర, రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులుగా చెబుతూ నకిలీ గుర్తింపు కార్డులు, శాలరీ సర్టిఫికెట్లు, బ్యాంక్ అకౌంట్లు సృష్టించి ఎస్‌బీఐ అధికారులను నమ్మించారు. అనంతరం వారికి రుణాలు ఇప్పిస్తే ముఠా సభ్యులకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇదేక్రమంలో బ్యాంక్ అధికారులను నమ్మించి వివిధ బ్రాంచ్‌ల్లో రూ.60లక్షల మేర రుణాలు తీసుకోగా, గత మూడు నెలలుగా ఈఎంఐలు కూడా చెల్లిస్తుండడంతో బ్యాంక్ అధికారులకు ఎలాంటి అనుమానం రాలేదు. ఇటీవల ముఠా సభ్యుల్లో డబ్బు పంపకాలపై గొడవ రావడంతో ఒకరు ఖమ్మం వన్‌టౌన్ ఎస్ఐ రాజుకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టగా అసలు మోసం బయటపడింది. ఈమేరకు గుగ్గిళ్ల విజయ్, కరుణాకర్‌తో పాటు రుణం పొందిన దినేష్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేశారు. మిగతా వారి కోసం పోలీసులు గాలిస్తుండగా, ఈ వ్యవహారంలో బ్యాంకు ఉద్యోగుల్లో ఎవరి పాత్ర అయినా ఉందా అనే కోణంలోనూ ఆరా తీస్తున్నట్లు సమాచారం.

మాజీ సర్పంచ్‌పై హత్యాయత్నం

- తీవ్రంగా గాయపడిన రామారావు
- కొణిజర్లలో ఉద్రిక్తత, పోలీస్ పికెట్ ఏర్పాటు

కొణిజర్ల: కొణిజర్ల మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ ఎల్‌డీఎం ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ సూరంపల్లి రామారావుపై బుధవారం అర్ధరాత్రి హత్యాయత్నం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆయనపై మారణాయుధంతో దాడి చేయగా పొట్టతో పాటు పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు... రామారావు బుధవారం స్థానికంగా ఓ వివాహ వేడుకకు హాజరై రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చేశాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయాన మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చిన ఆయన ఇంటి వెనక బాత్‌రూమ్ వైపు వెళ్లగా అక్కడ మాటు వేసిన గుర్తుతెలియని వ్యక్తులు పిడిగుద్దులతో దాడి చేశారు. దీంతో రామారావు ఇంట్లోకి పారిపోతుండగా ఉన్న బల్లెంతో దాడి చేయగా, పొట్టలో ఎడమ పక్క దిగబడింది. ఈమేరకు ఆయన ఇంట్లోకి పరుగెత్తి తల్లి సుశీలకు చెబుతూనే బయటకు రాగా, వివాహ వేడుక వద్ద ఉన్న వారు రామారావును ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనను ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. కాగా, ఘటనాస్థలిని వైరా ఏసీపీ ఎం.ఎ.రహమాన్, సీఐ సాగర్ నాయక్ సందర్శించి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఖమ్మం ఆస్పత్రిలో రామారావుతో మాట్లాడి వివరాలు సేకరించారు.

పోలీస్ పికెట్

రామారావుపై హత్యాయత్నం జరిగిందనే ప్రచారంతో కొణిజర్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. దీంతో ఎలాంటి ఘటనలు జరగకుండా మండల కేంద్రంలో 144 సెక్షన్ విధించి పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కాగా, రామారావు ఆస్పత్రిలో పోలీసులకు వెల్లడించిన వివరాల ఆధారంగాపోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. భూవివాదం కారణంగా దాడి జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా, రామారావుపై దాడి సందర్భంగా పెనుగులాటలో నిందితుడి టీషర్టు ఘటనా స్థలంలోనే పడిపోగా దాంతో పాటు మారణాయుధాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, ఏడాదిన్నర క్రితం కూడా రామారావుపై నక్సల్స్ పేరుతో కొందరు హత్యాయత్నానికి పాల్పడ్డారు.



రామారావు నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు



దాడికి ఉపయోగించిన ఆయుధం

మంత్రి పొంగులేటి పరామర్శ

గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో గాయపడిన రామారావును మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఖమ్మంలో కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించాక, నిందితులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీని ఆదేశించారు.

మహిళ మృతి కేసులో నిందితుడి అరెస్ట్

భద్రాచలంఅర్బన్: దాడి ఘటనలో మృతి చెందిన మహిళకు సంబంధించిన కేసులో నిందితుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని సీతారామ్‌నగర్ కాలనీకి చెందిన తమ్మళ్ల మాణిక్యమ్మ (63) మనవడు నవీన్, అభిలాష్ స్నేహితులు కాగా కొద్దిరోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 17న రాత్రి అభిలాష్ సీతారామ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న నవీన్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో నవీన్ లేకపోవడంతో ఇంట్లో ఉన్న అతని అమ్మమ్మ మాణిక్యమ్మతో వాగ్వాదానికి దిగాడు. పక్కనే ఉన్న కర్రతో తలపై కొట్టడంతో వృద్ధురాలు స్పృహ తప్పి కిందపడింది. దీంతో అభిలాష్ అక్కడి నుంచి పరారయ్యాడు. కుటుంబ సభ్యులు ఆమెను హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఈ నెల 24న మృతి చెందింది. మృతురాలి కొడుకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో అభిలాష్‌ను అనుమానితుడిగా పేర్కొనంగా, పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం భద్రాచలం నుంచి కూనవరం మీదుగా వెళ్తుండగా మార్గంమధ్యలో అభిలాష్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడిని స్థానిక కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పీవీఎస్ రావు తెలిపారు.